క్లుప్తంగా

పక్కాగా స్క్రీనింగ్ పరీక్షలు

• డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఇందులో భాగంగా పక్కాగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ సుజాత తెలిపారు. శుక్రవారం నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతుందన్నారు. వైద్యశిబిరాల్లో యుక్తవయసులో ఉన్న బాలికలందరికీ పరీక్షలు చేయించి రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. వారి ఆరోగ్యం, విద్య గురించి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులను గుర్తించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించాలన్నారు. టీకాలు వేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, డీపీహెచ్ఎన్ఓ నరసింహారావు, డీపీఓ రమేష్, డీసీఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

సందేహాలను నివృత్తి చేసేందుకే ఓపెన్ ఫోరం

• కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి సందేహాలు, ఫిర్యాదులు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిషనర్ నందన్ అన్నారు. ఎస్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై 22 మందికి సందేహాల నివృత్తి చేశామని తెలిపారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్ల యజమానులకు చట్టబద్ధ హక్కులు కల్పించే ఎల్ఆర్ఎస్ పథకం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాజా ఉత్తర్వుల ప్రకారంగా ఈ ఏడాది జూన్ నెల 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లు క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నట్లు చెప్పారు. గుడిపల్లిపాడు ప్రాంతంలోని లేఅవుట్‌కు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు, స్థల అధికారిక యాజమాన్య హక్కు పత్రాలను పొందారు. సిటీ ప్లానర్ హిమబిందు, బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సుజాత వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని కిసాన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న రాజీవ్ గాంధీ కాలనీలో మలేరియా కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మతో కలిసి డీఎంహెచ్ఓ శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. లార్వా, ఫీవర్ సర్వే, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు దోమతెరలు వినియోగించాలన్నారు. దోమల వల్లే డెంగీ, మలేరియా తదితర జబ్బులు వస్తాయన్నారు. నిల్వ ఉన్న నీటి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, అలాగే దోమల లార్వాలను తినే గంబూసియా చేపలను వదలాలని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్‌బాబు, సహాయ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు, శాంసన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీపై యాక్షన్ ప్లాన్



మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: యూరియా పంపిణీపై మండలాల వారీగా రైతుల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వ్యవసాయ, హార్టికల్చర్, పశు సంవర్ధక, మైక్రో ఇరిగేషన్, సహకార, ప్రకృతి వ్యవసాయం, మత్స్య శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు నిర్ణీత కార్డులను అందజేసి యూరియా పంపిణీ వివరాలను అందులో నమోదు చేయాలన్నారు. యంత్రాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా మరింత కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, డీసీఓ గుర్రప్ప, మత్స్యశాఖ జేడీ శాంతి, పశుసంవర్థక శాఖ జేడీ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలమయం.. గుండెల్లో భయం

కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనే ఉండదు. రోడ్ల అభివృద్ధి చేసేశామని ప్రజాప్రతినిధులు ప్రచారం చేస్తుంటారు. కానీ దెబ్బతిన్న రహదారులపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. నెల్లూరు పొట్టేపాళెం కలుజు రోడ్డు దారుణంగా ఉంది. అసలే భారీ గుంతలున్నాయి. తాజాగా వాటిలో వర్షపునీరు చేరింది. దీంతో భయంభయంగా తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



అదుపుతప్పితే అంతే..



ఇలా వెళితే మేలు..



ఎన్ని గుంతలో..

ముందస్తు ప్రణాళిక అవసరం

• కలెక్టర్ హిమాన్షు శుక్లా



మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల్ని కాపాడేందుకు ముందస్తు ప్రణాళిక అవసరమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్లో జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం, మందులు, తాగునీరు, దుప్పట్లు మొదలైనవి సమకూర్చే వ్యాపారులు, చెట్లు, విద్యుత్ లైన్లను తొలగించేందుకు జేసీబీ నిర్వాహకుల జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రైవేట్ పాఠశాలల బస్సుల వివరాలు, వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రుల సమాచారం తదితరాలు, రోప్‌లు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కమిటీలోని అధికారులందరూ వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో విజయ్‌కుమార్, ఆత్మకూరు, కావలి ఆర్డీఓలు పావని, వంశీకృష్ణ, పశుసంవర్థక, మత్స్యశాఖ జేడీలు రమేష్‌నాయక్, శాంతి, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, డీటీసీ చందర్, ఎస్ఈ విజయన్, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యలను వివరిస్తున్న సురేంద్రబాబు

నెల్లూరు(బృందావనం): క్రిస్టియన్ మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ నేత ఉరందూరు సురేంద్రబాబు విన్నవించారు. తాడేపల్లిలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అడపాల రాజశేఖర్‌ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపులో జరుగుతున్న జాప్యం, నూతన విధివిధానాల ఖరారు, చర్చిల నిర్మాణాలు, మరమ్మతులు, శ్మశానవాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు తదితర విషయాలపై చర్చించామన్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లోని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో నేతలు జి.భరత్, ఎం.జాషువా, జుగుంట కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సీతాదేవి 21వ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆ కమిటీ, శ్రీవాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపం కమిటీల అధ్యక్షులు తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావులు తెలిపారు. మందిరంలో ఆహ్వానపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, స్వామి హనుమంతరావు, తాతా వెంకటకిశోర్‌కుమార్, వంకా శ్రీహరి, ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాస దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుపద్య కంఠస్థ పోటీలకు స్పందన



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీఅన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతి సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు తెలుగుపద్య కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ తెలుగుపట్ల మక్కువ పెంచాలన్న లక్ష్యంతో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. వంద మందికి పైగా పాల్గొన్నట్లు చెప్పారు. విజేతలకు ఈనెల 22వ తేదీన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. న్యాయనిర్ణేతలుగా బి.రమణయ్య, మల్లెల శ్రీహరి, కె.వెంకటస్వామిరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, ఎస్.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొని పర్యవేక్షించారు.

అర్జీలను పరిష్కరించండి

• జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



మాట్లాడుతున్న మోహన్‌రావు

నెల్లూరు(పొగతోట): ప్రజలిచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వివిధ మండలాల పరిపాలనాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. కేటాయించిన నిధులు, ఖర్చులు దానికి సంబంధించిన బిల్లులు పక్కాగా ఉండాలని తెలిపారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

• ఆర్డీ హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ హరికృష్ణ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి నూరుశాతం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రీజినల్ డైరెక్టర్ హరికృష్ణ ఆదేశించారు. కమిషనర్ నందన్‌తో కలిసి ఆయన రెవెన్యూ విభాగంతో సమీక్షను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆర్డీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ పరిధిలో రూ.100 కోట్ల పన్ను వసూళ్లు సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని 15 కార్పొరేషన్లతో పోటీ పడుతూ మొదటి నాలుగు స్థానాల్లో నెల్లూరు ఉండేలా చూడాలన్నారు. భవనాల్లో నూతనంగా నిర్మించిన అదనపు అంతస్తులు, రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌గా మారిన భవనాలను గుర్తించి పన్నులను పెంచి వసూళ్లు సాధించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ విభాగం అధికారులు సమద్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ చినబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలగొట్టి చోరీ

నెల్లూరు(క్రైమ్): కారు అద్దాలు పగలగొట్టి నగదు, ల్యాప్‌టాప్ తదితరాలను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. వివరాలు.. ఏఎస్‌పేట మండలానికి చెందిన కీర్తి తన పిల్లలకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గురువారం తన కారులో పొగతోటలోని ఓ హాస్పిటల్‌కు తీసుకొచ్చింది. డాక్టర్ వద్ద పిల్లల్ని చూపించి రాత్రి మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న బాటా షోరూమ్‌కు వచ్చారు. కారును షోరూమ్ ఎదుట పార్క్ చేసి లోనికి వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు కారు కుడివైపు వెనుక డోర్ అద్దాలు పగలగొట్టి లోపల ఉన్న రెండు ల్యాప్‌టాప్‌లు, పాస్‌పోర్టు, హ్యాండ్‌బ్యాగ్, ఫోన్, కాలి వెండిపట్టీలు, రూ.15 వేల నగదును దోచుకెళ్లారు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శుక్రవారం షోరూమ్ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ పుటేజీని పరిశీలించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

నెల్లూరు(క్రైమ్): తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. వారి కథనం మేరకు.. పడుగుపాడుకు చెందిన ఓ కుటుంబం కోటమిట్టలోని బంధువుల ఇంటికొచ్చింది. శుక్రవారం అందరూ నమాజ్‌కు వెళ్లగా 12 ఏళ్ల బాలుడు ఒక్కడే ఉన్నాడు. కొద్దిసేపటి అనంతరం బాలుడు సైకిల్ తొక్కుకుంటూ సుజాతమ్మ కాలనీ వద్దకు వచ్చాడు. అక్కడి నుంచి ఎలా ఇంటికి వెళ్లాలో తెలియక ఏడుస్తుండగా స్థానికులు దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల నగర పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. దర్గామిట్ట పోలీసులు బాధిత తల్లిదండ్రులను గుర్తించి బాలుడిని సురక్షితంగా అప్పగించారు. వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మానసికంగా బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. డైకస్ రోడ్డు కుండల దర్గావీధిలో షేక్ షంషాద్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె రెండో కుమారుడు సమీర్ ఏసీ కూరగాయల మార్కెట్లో పని చేస్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో పదేళ్ల క్రితం భార్య అతడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నారు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమీర్ అదృశ్యమయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించి జాడ తెలియకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం వాస్తవాలను గ్రహించాలి

నెల్లూరు రూరల్: కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా జలాల వినియోగ సామర్థ్యాన్ని భారీగా పెంచుతున్నాయని సీఎం చంద్రబాబు వాస్తవాలను గ్రహించాలని బీజేపీ నేత మిడతల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. కృష్ణా జలాల వినియోగంలో ముంచుకొస్తున్న ప్రమాదంపై సీఎం వెంటనే దృష్టి పెట్టకపోతే ఆంధ్రా, రాయలసీమలో బీడు భూములు మాత్రమే మిగులుతాయన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

నెల్లూరు(టౌన్): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరగాల్సిన అథ్లెటిక్స్ పోటీలను వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్లు డీఈఓ కృష్ణారెడ్డి, ఎస్జీఎఫ్ అండర్ – 19 జిల్లా సెక్రటరీ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో పోటీల తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు.

అనుమతి లేని లేఅవుట్లను ధ్వంసం చేస్తాం

నెల్లూరు(బారకాసు): నుడా పరిధిలో అనుమతి లేని లేఅవుట్లను త్వరలోనే ధ్వంసం చేయబోతున్నామని చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని నుడా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నుడా పరిధిలో 437 లేఅవుట్లుంటే కేవలం 23కి మాత్రం దరఖాస్తులు వచ్చాయన్నారు. సమావేశంలో పెంచల్‌రెడ్డి, పీఓ హిమబిందు, కాలేషా, చంద్ర, సుష్మాంజలి పాల్గొన్నారు.

వేడుకగా చిత్రకూట ఉత్సవం



విశేషాలంకరణలో స్వామి

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో శుక్రవారం చిత్రకూట ఉత్సవం వేడుకగా జరిగింది. ఆయన తూర్పు రాజగోపురం నిర్మాణ కైంకర్యపరులు ఎరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతి సందర్భంగా చిత్రకూట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. దేవస్థానం నుంచి స్వామి ఉభయదేవేరులతో కలిసి చిత్రకూటం వద్దకు తరలివచ్చారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకం



మాట్లా డుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని పీసీసీ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాశాలలకు అవసరమైన రూ.8 వేల కోట్లను కేంద్రం నుంచి కూటమి ప్రభుత్వం తీసుకురాలేదా అని ప్రశ్ని ంచారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ ఓట్ చోరీ చేసిందనన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆ పార్టీకి వత్తాసుగా మారిందన్నారు. పెరమన వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు నష్టపరిహారం రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు సంజయ్‌కుమార్, సుధీర్, మల్లికార్జునరెడ్డి, అల్లావుద్దీన్, రెహమాన్, సుజాత, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

పదిరోజులపాటు గుజరాత్ యాత్ర



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ: వచ్చే నెల 7వ తేదీ నుంచి 10 రోజులపాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను నిర్వహించనున్నట్లు తిరుపతి ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్, విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. నెల్లూరు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వివిధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను దర్శించే అవకాశం యాత్రికులకు కలుగుతుందన్నారు. రైలు రేణిగుంట నుంచి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంట చేరుతుందన్నారు. ప్రయాణికులకు బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు ఐఆర్‌సీటీసీ టూరిజం వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రిటైనింగ్ వాల్‌ను పూర్తి చేయాలంటూ..

• సీపీఎం నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ పెన్నానది పక్కనున్న భగత్‌సింగ్ కాలనీ వద్ద ఆపేసిన రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నేతలు శుక్రవారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాల్ పనులు పూర్తిగా నిలిపివేసిందన్నారు. నదికి వరదనీరు వచ్చిన సమయంలో తమ ప్రాంతం మునిగిపోతుందని భగత్‌సింగ్ కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మూలం ప్రసాద్, శ్రీనివాసులు, జాఫర్, మస్తాన్, సాయి, వహీదా, సమీవుల్లా, అల్లాభక్షు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

• 33/11 కేవీ డైకసరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండదిబ్బ, అలంకార్‌సెంటర్, బ్రాహ్మణ వీధి, ఫత్తేఖాన్‌పేట, రమేష్‌రెడ్డినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు.

• 33/11 కేవీ బోడిగాడితోట పరిధిలోని బోడిగాడితోట, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాస నగర్, సత్యనారాయణపురం, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదు.

• 33/11 కేవీ ఎంజీ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జెడ్పీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, బషీర్ నగర్, అంబేడ్కర్ నగర్, కలెక్టర్ బంగ్లా, బారాషహీద్ దర్గా, నీలగిరి సంఘం, బట్వాడిపాళెం, కేవీఆర్ పెట్రోల్ బంకు సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

• 33/11 కేవీ పడారుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీ, ఆర్టీఓ కార్యాలయం, కల్యాణ్ నగర్, బీవీ నగర్, వికలాంగుల కాలనీ, మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తారు.

• 33/11 కేవీ ఏకేనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ కాలనీ, రెవెన్యూ కాలనీ, రిత్విక్ ఎన్‌క్లేవ్, చంద్రమౌళి నగర్, సావిత్రి నగర్, కేశవుల నగర్, ఏపీ టూరిజం, వేదాయపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

త్రీఫేజ్ విద్యుత్ అందించడమే లక్ష్యం



విద్యుత్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ అందించడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోందని చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్) రమణాదేవి అన్నారు. శుక్రవారం ఆమె జిల్లాకు వచ్చారు. గ్రామాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రూరల్ డివిజన్ పరిధిలోని పొట్టేపాళెం, దేవరపాళెం, కొమ్మరపూడి, సిద్ధీపురం ప్రాంతాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. అదేవిధంగా నగరంలో ఏర్పాటు చేయనున్న కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రూ.400 కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల పనులు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా 139 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేట్ కార్యాలయ ఈఈ రాజేంద్రప్రసాద్, ఈఈలు పరంధామయ్య, భానుప్రకాష్, శ్రీధర్, లక్ష్మీనారాయణ, రమేష్ చౌదరి, బెనర్జీ, సోమశేఖర్ రెడ్డి, డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.